TGTEL/26/A5513

# వార్త దీపిక

ప్రచురణ : హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక: 58 | 06 ఆదివారం సెప్టెంబర్ 2026 | వెల: 02

## యూపీలో మసీదు కూల్చివేత..

### తెల్లవారుజామున చర్యపై అసదుద్దీన్ ఒవైసీ, అఖిలేశ్ ఫైర్

- ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామన్న అధికారులు, శాంతికి విజ్ఞప్తి

ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న మసీదును అధికారులు కూల్చివేయడం రాజకీయ ప్రకంపనలకు దారితీసింది. శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఈ చర్య చేపట్టడంపై మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యోగి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని వారు ఆరోపించారు. ...మిగతా 2 లో...



## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

- రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్
- 420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్
- మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్‌ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు.

...మిగతా 2 లో...

# విద్యాశాఖలో కీలక మార్పులు...

## - టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ



విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. ...మిగతా 2 లో...

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ
- కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా
- ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు
- సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.



ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు.కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.



## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?: రఘునందన్ రావు

- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం
- 12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏ లో చేర్చారన్న రఘునందన్ రావు
- ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు.పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమా వేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబి తాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు.

...మిగతా 2 లో...

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు: బండి సంజయ్

- ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్
- ఉపాధ్యాయులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన
- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

### కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

- కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్
- కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ
- కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి
- విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. ...మిగతా 2 లో...



## కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది:

- 22ఏ నిషేధిత భూముల జాబితాపై రాంచందర్ రావు విమర్శలు
- ధరణి పేరుతో ప్రజలను పీడించిన కేసీఆర్ ప్రభుత్వం ఓటమిపాలైందని ఆరోపణ
- రేవంత్ కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని వ్యాఖ్య



సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. ...మిగతా 2 లో...

### సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?: రేవంత్ సర్కార్‌పై

## హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం...

కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్‌ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.



## శ్రీనివాస్ రెడ్డి రూ. 5 లక్షలు డొనేషన్..!

సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :

ఆర్ బివోఎల్, సిఇవో భుయాని శ్రీనివాస్ రెడ్డి సరస్వతి పాఠశాల అదనప గది నిర్మాణానికి రూ.5 లక్షలు డొనేషన్ ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# సింగరేణి కార్మికులపై వేధింపులు ఆపాలి

- టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నిరసన హోరు
- సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లు వెంటనే రద్దు చేయాలి
- కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక

వార్త దీపిక న్యూస్ : :

సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన హోరు మిన్నంటింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆర్జీ-1 ఏరియాలోని జిడికె 2 & 2ఏ ఇన్క్లైన్ వద్ద ఈ నిరసన ధర్నా చేపట్టారు. వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మికులపై జారీ చేసిన ఛార్జ్ షీట్లు, సస్పెన్షన్లు, డిస్మిసల్స్ వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి రికార్డుల్లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కారుణ్య మరియు డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. ఖాళీల ఆధారంగా అర్హులైన కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వారికి బకాయిలతో కూడిన పింఛన్ మంజూరు చేయడంతో పాటు క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని




నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 250 గజాల ఇండ్ల స్థలాలు, 100 శాతం ఇన్వాలిడేషన్ ఉద్యోగాలు, ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు వంటి వాగ్దానాలను పూర్తిగా విస్మరించి కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పాలనలో 19,000 మందికి ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, మెడికల్ కాలేజీల్లో కార్మికుల పిల్లలకు 5 శాతం కోటా ఇచ్చామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, కార్మికులను వేధిస్తూ సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లతో తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో మాదాసి రామ్మూర్తి, నూనె కొమరయ్య, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, దూత శేషగిరి, మేకల సమ్మయ్య, మూల విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూపీలో మసీదు కూల్చివేత..

## తెల్లవారుజామున చర్యపై అసదుద్దీన్ ఒవైసీ, అఖిలేశ్ ఫైర్

మొదటిపేజీ తరువాయి

శనివారం ఉదయం భారీ భద్రత బలగాల నడుమ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ఐదు ప్రధాన ద్వారాలను మూసివేసి, న్యాయవాదులతో సహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. ముందుజాగ్రత్త చర్యగా ఐదు కంపెనీల పీఏసీ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు సంయమనం పాటించాలని, ఎటువంటి వదంతులను నమ్మవద్దని సహారన్‌పూర్ రేంజ్ డీఐజీ అభిషేక్ సింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మసీదు అక్రమ నిర్మాణమని పేర్కొంటూ 2025లో బజరంగ్ దళ్ నేత వికాస్ త్యాగి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సహారన్‌పూర్ సిటీ మేజిస్ట్రేట్, జూలై 16న ఆ నిర్మాణాన్ని అక్రమంగా నిర్ధారిస్తూ కూల్చివేతకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ మసీదు కమిటీ జిల్లా కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 2న న్యాయస్థానం వారి అప్పీల్‌ను తిరస్కరించింది.ఈ ఘటనపై స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ, హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడానికే ప్రభుత్వం తెల్లవారుజామున కూల్చివేత చర్యలు చేపట్టిందని విమర్శించారు. "బీజేపీ ప్రభుత్వానికి మసీదు అనే పదంపైనే ద్వేషం ఉంది" అని ఆయన మండిపడ్డారు. మసీదు కమిటీకి అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని ఒవైసీ హామీ ఇచ్చారు.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. "బాధితులకు హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఎందుకు కల్పించలేదు? ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కుమ్మక్కై న్యాయం అందకుండా చేశారు. ఇతర మతాలను గౌరవించని వారు సనాతనులు కాలేరు" అని ఆయన వ్యాఖ్యానించారు.

## బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

వార్త దీపిక న్యూస్ :

హనుమాన్‌నగర్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ఆకట్టుకోగా, శ్రీకృష్ణుని జీవిత విశేషాలు, గీతా సందేశం, ధర్మం, నీతి విలువలపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని స్మరించుకుంటూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుని బోధనలు స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవరచుకోవడంతో పాటు గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

-హెచ్ఎం నరసింహారావు

-ఆరెంద జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

వార్త దీపిక న్యూస్ :

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆరెంద జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నరసింహారావు సూచించారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంథని మండలం ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందించే విద్య, విలువలు, క్రమశిక్షణ విద్యార్థుల జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి నడవడిక, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి పాఠశాలకు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను చిన్న వయసులోనే నిర్దేశించుకుని, వాటిని సాధించే దిశగా నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రతిభ ఒక్క రోజులో రాదని, ప్రతిరోజూ క్రమశిక్షణతో చదవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు జ్ఞానంతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు.

### ఉపాధ్యాయుల బోధనను సద్వినియోగం చేసుకోవాలి: సీఆర్పీ మల్లయ్య

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు




బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని సిఆర్పి మల్లయ్య సూచించారు. తరగతి గదిలో చెప్పే విషయాలను ఇంటి వద్ద పునశ్చరణ చేసుకుంటూ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమని, వారి సూచనలను పాటిస్తూ కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన శ్రీలత విద్యార్థుల విద్యాభ్యాసంపై చూపిన ప్రత్యేక శ్రద్ధను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఆమెకు లభించే 27 రోజుల సెలవుల్లో 16 రోజులు కూడా పాఠశాలకు హాజరై విద్యార్థులకు బోధన అందించినందుకు గుర్తింపుగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని చాటుకుంటూ వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు ప్రేమతో తీసుకొచ్చిన చిరు కానుకలను అందజేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓడ్నాల సహేందర్,సువార్త, మమత, పద్మజ, ఎం.డి. గియాసుద్దీన్, శ్రీవాణి, శ్రీలత, అమన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో కీలక మార్పులు...

మొదటిపేజీ తరువాయి

తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు.విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు.కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?: రఘునందన్ రావు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది:

మొదటిపేజీ తరువాయి

గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

### కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీయస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు. ఇప్పట్లో విస్తరణ లేనట్లే!ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# గురువులే విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచి..!











## ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

నియోజకవర్గం మున్సిపల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం, నూతన విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమానికి శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని కొనియాడారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనం, హాస్టల్ వసతితో పాటు విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తోందని తెలిపారు. జూనియర్ కళాశాల దశ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నిర్దేశిత లక్ష్యంతో చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, రమేష్ చౌహాన్, మాజీ సర్పంచ్ యాదవ్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు కెనాల్ ద్వారా సాగునీరు అందించాలి

**అందోల్, చౌటకూర్, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులోని రైతులకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మేఘరాజ్ నాయక్, మహేష్ రాథోడ్ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు.
సింగూర్ కెనాల్ ద్వారా బొమ్మారెడ్డిగూడెం పరిధిలోని పోష్కుంట, ఏశ్వమ్ చెరువు, గొల్లకుంట, నాన్ చెరువు, కోమటి చెరువులకు నీటిని అందించాలని కోరారు. ఈ చెరువులకు సింగూర్ కెనాల్ నీరు అందితే సుమారు 1500 ఎకరాలకు చౌటాకుర్ రెవెన్యూ పరిధిలోని గ్రామాలు సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు.
ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మేఘరాజ్ నాయక్, మహేష్ రాథోడ్ కలిసి ఎస్ఈ యశస్వి, ఈఈ భీమ్ వినతిపత్రం అందజేశారు.
సాగునీటి సమస్యను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.మంత్రి ఆదేశాలతో అధికారులు సైతం సానుకూలంగా స్పందించి, కెనాల్‌కు సంబంధించిన పనులను వెంటనే చేపట్టి, రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



# ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం..!

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురు పూజ వేడుకలు

**జహీరాబాద్, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల జహీరాబాద్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్లాం ఫారూఖీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన సేవలు, ఆయన ఆలోచనలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఎస్. రాములు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, ఒక మంచి ఉపాధ్యాయుడు అనేక మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దగలడని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, వారు చూపిన మార్గంలో నడిచి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి విద్యతో పాటు విలువలను అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు జగన్ మోహన్, డి. ప్రీతి, నాగరాజ్, ఎండి. ముజఫర్ ఆలీ, సిద్ధప్ప, పోలీస్ ప్రవీణ్,ఆర్ మదన్ , మస్రత్, సత్యనారాయణ, ఇస్రత్ సుల్తానా, ఇర్ఫాన్ ఆ బేగం, జోహా, ఫాతిమా బేగం, ఇస్రాత్ ఉన్నిసా, రానా తబస్సుమ్, వుజైఫా, మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను కొనసాగిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






# హామీలు అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి పోస్టు ఊడక తప్పదు..!





## ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా నాలుగో రోజు సంగారెడ్డిలో విద్యార్థి--యువజన నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో నిరసన ప్రదర్శన నిర్వహించి, అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యువత తమ హక్కుల కోసం పోరాడిన సందర్భాలను గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్య గొంతును అణచివేయాలని ప్రయత్నించినా యువత ఉద్యమాలు ఆగవని స్పష్టం చేశారు. హామీలు అమలు చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం అవుతుంది. యువత, విద్యార్థుల పక్షాన చివరి వరకు నిలబడతాం అని ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం అని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి, యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి. లేకపోతే ప్రజా ఉద్యమం తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. హామీలు అమలు చేసే వరకు మా పోరాటం ఆగదు, యువతకు న్యాయం జరిగే వరకు మా అడుగులు వెనక్కి పడవు" అంటూ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో విద్యార్థులు, యువజన నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చంద్ర గౌడ్, మాజీ డీసీసీబీ వైస్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, హకీం, మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి , మనోహర్ గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు యువత నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్ పెద్ద ఎత్తున యువకులు విద్యార్థులు పాల్గొన్నారు .

# బీసీ సంఘం ఆధ్వర్యంలో మాణిక్‌రావు జయంతి..!

**తాండూర్, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

స్వర్గీయ మాజీ మంత్రి, తెలంగాణ సర్దార్‌గా పేరుగాంచిన బీసీ ముద్దుబిడ్డ ఎం. మాణిక్‌రావు జయంతి సందర్భంగా తాండూరు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంఘం కన్వీనర్ రాజ్‌కుమార్ కందుకూరి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జైలు జీవితం అనుభవించిన మాణిక్‌రావు బీసీల హక్కులు, అభివృద్ధి కోసం అసెంబ్లీలో గళమెత్తిన మహానేత అని, తాండూరు ప్రాంత అభివృద్ధికి జుంటుపల్లి, కోటపల్లి వంటి ప్రాజెక్టులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకుర్, వడ్డెర సంఘం జిల్లా నాయకులు వడ్డే సత్యనారాయణ, మండలాల అధ్యక్షులు నరేందర్ ముదిరాజ్, బసంత్ కుమార్, బీసీ సంఘం యువ నాయకులు జోసఫ్, శ్రీకాంత్, బసవరాజ్, నాయి రాజు, అరుణ్ రాజ్, మోచిరాజు, పవన్, శివకుమార్, వివేక్, కిరణ్‌లి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

**తాండూర్, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

తాండూర్ శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలతో శ్రీకృష్ణుని గోపిక వేషధారణలో అలరాలించారు.చిన్నారులను ఆశీర్వదించేందుకు రాష్ట్రపతి అవార్డు గ్రహీత బస్వరాజ్ రిటైర్డ్ టీచర్అదేవిధంగా పాఠశాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీ మల్లేశం రిటైర్డ్ లెక్చరర్ విచ్చేసి చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది.పాఠశాల యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు ఆచారి మాతాజీలు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. అదేవిధంగా తాండూర్ లో ఇంకా అనేక పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించుకోవడం జరిగింది. వేదిక్ విశిష్ట పాఠశాలలో,కోటేశ్వర బ్రిలియంట్ పాఠశాలలో, ఐరా మోడల్ స్కూల్లో,కృష్ణవేణి కాన్సెప్ట్ లో వేడుకలను చాలా ఘనంగా నిర్వహించారు.



TGTEL/26/A5513
వార్త దీపిక

# గురువు చూపిన మార్గం... విద్యార్థుల భవిష్యత్ కు పునాది..!

### ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..!

### ఉపాద్యాయు వేడుకలలో పాఠశాల కరస్పాండెంట్ సంగమేశ్వర్

**మునిపల్లి, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

ఉపాధ్యాయులు దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని వీరభద్ర విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సంగమేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, జ్ఞానం, మంచి విలువలను అందిస్తూ భావితరాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ ఉపాద్యాయరాలు, ఉపాద్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వీరభద్ర విద్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..!

### అకట్టుకున్న చిన్నారుల ఆట పాట

### అంగరంగవైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి సంబరాలు

**మునిపల్లి, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

మండల పరిధిలోని కంకోల్ గ్రామంలోని వీరభద్ర పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ సంగమేశ్వర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రార్థన అనంతరం విద్యార్థులు కృష్ణుని భజనలు, పాటలు పాడడం జరిగింది. తరువాత ఉట్టి కొట్టే కార్యక్రమంలో వీరభద్ర విద్యాలయం యాజమాన్యం కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. కృష్ణ, బలరాములు, యశోద, గోపికల వేషధారణలో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల కోలాటం, అభినయ గేయాలు, చెక్క భజన, ఘోష్, నృత్యాలు ఎంతో ఉత్సాహంతో చేయగా అందరూ జై శ్రీకృష్ణ అంటూ కేరింతలు కొట్టిన అనంతరం పాఠశాల కరస్పాండెంట్, పాఠశాల డైరెక్టర్ సంగమేశ్వర్ మాట్లాడుతూ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రతీ సంవత్సరం ఎంతో ఆనందంగా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. “దుష్ట శిక్షణ ధర్మ రక్షణ కోసం శ్రీ కృష్ణ పరమాత్ముడు అవతరించి విశ్వ కళ్యాణం కోసం ద్వాపర యుగంలో కృష్ణావతారుడిగా, పాండవుల రథ సారధిగా, మార్గ దర్శకుడిగా ప్రపంచాన్ని రక్షించాడని ఈ ప్రపంచమంతా శ్రీకృష్ణ మయని తెలిపారు. సుమారు మంది విద్యార్థులు చక్కటి వేషధారణతో అందరిని అలరించారు.




# ధర్మ పరిరక్షణతో పాటు వ్యాపార అభివృద్ధికి ప్రోత్సాహం..!





### డ్రై ఫ్రూట్స్ షాప్ ప్రారంభోత్సవంలో ఈర్ల రాజు ముదిరాజ్

**పటాన్చెరువు, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

పటాన్చెరువు టౌన్‌లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ శ్రీకృష్ణ భగవానుడి బ్రహ్మోత్సవాల్లో అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, నాయకులు, మిత్రులతో కలిసి ధర్మం, ఆధ్యాత్మికత, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యతపై చర్చించారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందాలంటే ప్రతి ఒక్కరూ వాటిని గౌరవిస్తూ ముందుకు తీసుకెళ్లాలని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు. భక్తి, ధర్మంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య యాదవ్, సన్నీ యాదవ్, రాజు, చారి పంతులు, తదితరులు పాల్గొన్నారు.

**నూతన ఫ్రూట్స్ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్ :**

అనంతరం అమీన్పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో రాజస్థానీ మార్వాడీ మిత్రులు నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై ఫ్రూట్స్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈర్ల రాజు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన డ్రై ఫ్రూట్స్ షాప్‌ను ప్రారంభించి, వ్యాపార రంగంలోకి కొత్తగా అడుగుపెట్టిన మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం అభివృద్ధి చెందడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన డ్రై ఫ్రూట్స్ అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. స్థానికంగా యువత, వ్యాపారులు కొత్త ఆలోచనలతో ముందుకు రావడం అభినందనీయమని, వ్యాపార అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థిక ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకోవాలని ఈర్ల రాజు ముదిరాజ్ అన్నారు. ఈ డ్రై ఫ్రూట్స్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు మనోజ్ జి. విట్టల్ జి. పరమేశ్వర్, దీపక్, మనోహర్, రతన్ రాకేష్ తదితర రాజస్థానీ మార్వాడీ మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ధర్మాన్ని గౌరవిస్తూ, సంస్కృతిని కాపాడుతూ వ్యాపారులకు అండగా నిలుస్తూ సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరితో కలిసి ముందుకు సాగడమే లక్ష్యం అని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి..!







### జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

### విద్యార్థులత కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడొద్దు..!

### ఓరుగల్లు గడ్డపై విద్యార్థుల పోరుబాట

### దాస్యం వినయ్ భాస్కర్

**హనుమకొండ, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన సందర్భంగా రాష్ట్రంలో విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఓరుగల్లు గడ్డపై భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ భారీ ర్యాలీకి విద్యార్థులు, యువత నుంచి విశేష స్పందన లభించింది. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి”, “జీవో 97ను రద్దు చేయాలి”, “విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి” అంటూ నినాదాలతో హనుమకొండ మార్మోగింది. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు, విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, యువత హక్కుల కోసం ఓరుగల్లు గడ్డపై ప్రారంభమైన ఈ పోరుబాటను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లోని డీఆర్వో కి వినతిపత్రం అందచే శారు.

నిరసన కార్యక్రమానికి వస్తున్న గవర్నమెంట్ పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు, అయినా విద్యార్థులు ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు, ఉద్యమంలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి.







### అంజి రెడ్డి శాసన మండలి సభ్యులు.

### జ్ఞానంతో పాటు విలువలు, విజ్ఞానం, సామజిక బాధ్యత నేర్పాలి

### మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్ వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన.

**సంగారెడ్డి ,ఆగష్టు 05:**

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో విద్యారంగానికి విశిష్ట సేవలందించిన 100 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియం లో శనివారం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజి రెడ్డి ఏం ఎల్ సి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ ఉపాధ్యాయులను, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భముగా అంజిరెడ్డి శాసన మండలి సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా వారి సేవలను గౌరవించడమే కాకుండా, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు , సమాజంలోని ప్రతి ఒక్కరికీ అది మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో అందిస్తున్న సేవలను గుర్తించి సత్కరించడం వారిలో మరింత స్ఫూర్తిని నింపుతుందని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతి రావు పూలే దంపతుల బోధనలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సమాజంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పిస్తూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని అంజిరెడ్డి అన్నారు. తల్లిదండ్రుల తరువాత విద్యార్థులపై ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టీచర్లు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి విద్యార్థి మనో వికాసం, సమాజ విలువలు, కట్టుబాట్లు, క్రమశిక్షణ అంశాలపై బోధించాలని సూచించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలని, అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు ప్రస్తుత కాలంలో విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాల స్థాయి నుంచే నిరంతరం అవగాహన కల్పించాలి . మత్తు పదార్థాలు ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తుపై చూపే ప్రతికూల ప్రభావాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు గుర్తించి తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు . సెల్‌ఫోన్ వినియోగంపై అధిక వినియోగం విద్యార్థుల ఏకాగ్రతను, చదువును దెబ్బతీయకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సెల్‌ఫోన్‌ను విద్యా ప్రయోజనాలకు, జ్ఞానాన్ని పెంపొందించుకు నేందుకు మాత్రమే సమర్థవంతంగా ఉపయోగించుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు . విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల్లో వృథా చేయకుండా చదువు, క్రీడలు, పుస్తక పఠనం పై దృష్టి కేంద్రీకరించాలని . సెల్‌ఫోన్‌కు బానిస కాకూడదనే విషయాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించాలి. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డిజిటల్ టెక్నాలజీ, రోబోటిక్స్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించాలి. భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలను అందిపుచ్చుకు నేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఇప్పటి నుంచే అభివృద్ధి చేసుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలన్నారు . కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి .అంజయ్య ,సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత, జిల్లా విద్యాధికారి రోహిణి ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.